క్లుప్తంగా

ఓపెన్ టు ఆల్ ఖోఖో పోటీలు

మక్తల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఉమ్మడి జిల్లా మహిళలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏకలవ్య స్పోర్ట్స్‌ క్లబ్ అధ్యక్షుడు గోపాలం తెలిపారు. మార్చి 7న ఖోఖో పోటిల్లో పాల్గొనే మహిళలు వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కరోజు టోర్నమెంట్ ఉంటుందని, ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జైన మందిరం ప్రారంభోత్సవం

కృష్ణా: మండలంలోని కున్సి గ్రామంలో జైన మందిరంలో గురువారం పార్శ్వనాథ్ భగవాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం నిర్వాహకులు వివరాలు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన జైన మత గురువులు, జైనులు అత్యధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. వచ్చే భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. మండల ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

జిన్నారంలో వైద్య శిబిరం



మరికల్: మండలంలోని జిన్నారంలో బుధవారం పద్మమ్మ, శేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాల వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వివిధ రకాల చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఐదు రోజుల పాటు ఆస్పత్రిలో ఉంచుకుని చికిత్సలు అందించి పంపిస్తామని వారు తెలిపారు.

నీటి వృథాను అరికట్టాలి

నర్వ: మండలంలోని ఆయా పంచాయతీలలో నీటి కుళాయిలకు మూతలు వేసి తాగునీటి వృథా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అసలే వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆయా గ్రామాల్లో తాగునీటి నల్లాలకు పంచాయతీ సిబ్బంది మూతలను తప్పకుండా వేయాలని కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామాల్లో దాదాపు 2గంటల పాటు వదిలే తాగునీటిని మూతలు లేకపోవడంతో చాలా నీరు వృథాగా పోతాయని వారు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది ఇటువంటి వాటిని వెంటనే గుర్తించి మూతలు బిగించి నీటి వృథాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

కులగణన చారిత్రక నిర్ణయం

మక్తల్: రాష్ట్రంలో కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించడం చారిత్రాత్మక నిర్ణయమని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, రవికుమార్, వెంకటప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల పరిశీలన



కృష్ణా: మండల కేంద్రంలోని, కున్సి ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను బుధవారం జీహెచ్‌ఎం నిజాముద్దీన్ పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు అన్ని రకాలుగా సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు నాగరాజ్, రంగారావు, లక్ష్మీ, నారాయణ, ఖాసీం అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



మరికల్: కోస్గిలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగసభకు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో వీరన్న, సూర్యమోహన్, రాజు, కృష్ణయ్య, రఘు, ఆంజనేయులు, రవి, రామకృష్ణ, మల్లేష, అంజిరెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.

నర్వ: బహిరంగ సభకు మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, ఎంపీటీసీ నీరజ్, వివేకవర్ధన్‌రెడ్డి కార్యకర్తలు ఉన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

- గత ప్రభుత్వాలు మహిళలను పట్టించుకోలేదు..
- మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు ఇచ్చిందేలేదు
- ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



మహిళలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు

నారాయణపేట/కోస్గి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో సీఎం హోదాలో తొలిసారిగా బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం హాజరై మాట్లాడారు. పదేళ్ల పాటు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మహిళలను పట్టించుకోలేదన్నారు. పావలా వడ్డీ రుణాలు ఇచ్చింది లేదు.. వడ్డించింది లేదన్నారు.

మహిళలతో సీఎం సంభాషణ..



గొల్ల శ్రీదేవి: నా పేరు గొల్ల శ్రీదేవి. వికారాబాద్ జిల్లాలోని కుల్కచర్ల గ్రామం. 2006లో గ్రామ సంఘంలో చేరారు. నేను ఎదగలేని మధ్య తరగతి కుటుంబం నాది. చిన్నగా కిరాణం షాపు పెట్టి ఎదిగాను. రూ. 20వేల నుంచి రూ.8 లక్షల దాకా ఆదాయం వచ్చింది.

సీఎం: మీ భర్త పేరు ఏమని శ్రీదేవిని అడిగారు. నా భర్త పేరు రమేష్ అని చెప్పారు. మీరు ఎంత వరకు చదివారు అని అడగ్గా.. నేను ఇంటర్ చదివా, పెళ్లి తర్వాత భర్త డిగ్రీ వరకు చదివించారు సార్. మీ భర్తను అభినందిస్తున్నా.. మంచిగా చదివించారు.



హాజమ్మ: సార్ నాపేరు హాజమ్మ మాది నారాయణపేట జిల్లా ఊట్కూర్ గ్రామం. జోగిని వ్యతిరేక పోరటా సమితి జిల్లా కన్వీనర్ కొనసాగుతున్నా. జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు పోరాడాను. నన్ను చిన్న వయస్సులోనే జోగినిగా మార్చారు. అయినా మా ఊర్లో ఒక అబ్బాయిని ఇంటర్ చదివిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నా. పెళ్లి చేసుకుందామనుకున్నా రూ. 5వేలు ఉండేవి కాదు. 15 మంది జోగినీలతో సంఘంగా ఏర్పడి రుణాలు తీసుకుని, ఇద్దరు పిల్లల్ని చదివించుకున్నా. కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో దాదాపు 500 మంది జోగినీలు చనిపోయారని మీ దృష్టికి తెచ్చా... నేను చనిపోవాలని అనిపిచ్చింది. అప్పుడు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో జోగినీల పిల్లలకు తండ్రి పేరు లేదని పాఠశాలల్లో చదవించేందుకు ఇబ్బంది పడేవాళ్లం. ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో లేవనెత్తి అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి 139 జీఓ రావాడానికి కారకుడు మీరే.. తండ్రితో సమానం తల్లి పేరు ఉంటే చాలు పాఠశాలల్లో చేర్చుకోవాలని వచ్చింది. జోగినీలకు దేవుడు మీరే అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని అభివర్ణించింది. 27 జీఓ తెలంగాణ ఒంటరి మహిళల పింఛన్ రావడానికి కారకులయ్యారన్నారు. రూ.4 కోట్లతో న్యూట్రీషన్ రైస్ మిల్‌ను నారాయణపేట జిల్లాలోని తిప్రాస్‌పల్లి వద్ద ఏర్పాటు చేయబోతున్నాం. మీ చేతుల మీదుగా ప్రారంభించాలని కోరుతున్నాం. రూ.వంద కోట్లకు తీసుకురావాలని ఆకాంక్ష. 300 గ్రామాల్లో సైనికుల్లా పనిచేస్తున్నాం. ఆత్మగౌరవంతో మహిళలు నేడు జీవిస్తుండడంతో సామాజిక తెలంగాణ వచ్చిందనిపిస్తోంది. మహిళలందరికి ధైర్యం వచ్చిందన్నారు. జోగినీలు లేని జిల్లాగా మారుస్తామన్నారు సీఎం.

సీఎం: హాజమ్మ జోగినీలు బాగుపడాలంటే ఏమి చేయాలో చెప్పాండి? హాజమ్మ మాట్లాడుతూ సార్ జోగినీలు బాగుపడాలంటే ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలి. పరిశ్రమలను నెలకొల్పేందుకు అండగా నిలవాలి. పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. జోగినీలకై ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇందుకు స్పందించిన సీఎం ఖచ్చితంగా వాటన్నింటినీ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



పద్మమ్మ, పోలేపల్లి: పాలెపల్లిలో గ్రామ సమాఖ్యకు భవనం కట్టించాలి.

సీఎం: పద్మమ్మ స్పీకర్ సారూ అమ్మమ్మ ఊరూ పోలేపల్లి. గ్రామ సమాఖ్య భవనం కట్టిందచేందుకు ఇప్పుడే అదేశాలిస్తున్నాం. కట్టించి ఇస్తారు ఒకేనా..



మొగులమ్మ, ఈజీపూర్: నాకు చిన్నప్పుడు రెండు కాళ్లు లేవు. సర్జాఖాన్‌పేట్‌లో పదో తరగతి చదివాను. సోషల్ వర్కర్‌గా పనిచేశాను. 2004 రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ తరపున సోనియా గాంధీ చేతుల మీదుగా త్రీవీలర్ అందుకున్నా. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం ఉన్నప్పుడు దివ్యాంగులకు రూ.200 నుంచి రూ.500 వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీల్లో రూ.6వేలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులు ఆత్మగౌరవంగా బతికేలా, రిజర్వేషన్ కల్పించాలన్నారు.



వసంత హస్నాబాద్: నా పేరు వసంత, హస్నాబాద్. బతుకు దేరువు కోసం హిందీ నేర్చుకుని ఉత్తరఖండ్, పంజాబ్ తదితర రాష్ట్రాలను తిరిగా. నేడు మహిళా సంఘాల్లో రుణాలు తీసుకుంటూ అభివృద్ధి చెందా. పిల్లలను చదివించుకుంటున్నా. రూ.20 లక్షలకు వరకు సంపాదించుకున్నా. గ్రామంలో సమాఖ్య భవనం లేక చెట్ల కింద సమావేశం చేసుకుంటున్నాం.

సీఎం: వసంతమ్మ.. బహుబలి సినిమాలో కాళకేయుడు ఎవరో తెలుసా.. హస్నాబాద్‌కు చెందిన వ్యక్తే అంటూ చెప్పుకొచ్చారు. ఆమె హిందిలో మాట్లాడటంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడిస్తూ గ్రామ సమాఖ్య భవనం మంజూరు చేయిస్తున్నమంటూ ప్రకటించారు.



యశోదమ్మ, దౌల్తాబాద్: మహిళా సంఘంలో చేరక ముందే ఎన్నో రకాలు ఇబ్బందులు పడ్డాం. 1995 గులాబీ మహిళా సంఘం ఏర్పాటు చేశాం. నేను ఎన్నో రకాల శిక్షణలు తీసుకున్నా. మండల సమాఖ్య బాలకార్మికులు ఉన్నవారిని గుర్తించి 8, 9, 10 తరగతి వరకు చదివించడం జరిగిందన్నారు.

సీఎం: పైసలుంటే పెద్దవాళ్లు కారు.. చదువుకుంటే పెద్దవాళ్లు అవుతారు. బాలకార్మికులను గుర్తించి చదివించడం అభినందనీయమన్నారు.

‘అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయండి’



వినతిపత్రం అందజేస్తున్న గార్లపల్లి గ్రామస్తులు

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని గార్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వచ్చే అంగన్‌వాడీ సరుకులు 3 కిలోమీటర్ల దూరం ఉండే అంగన్‌వాడీ కేంద్రం నుంచి తీసుకెళ్లే పరిస్థితి ఉందన్నారు. సంగంబండ రిజర్వాయర్‌లో తమ గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామంలో సౌకర్యాలు లేవని అన్నారు. పునరావాస బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు గ్రామం నుంచి తీసుకొచ్చారని, కేవలం పాఠశాల మాత్రమే ఉందన్నారు. చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం లేదని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో రాజుగౌడ్, చంద్రకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

ఊట్కూరు: విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని డాక్టర్ భవాని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికారాదని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, స్పందన, ఏఎన్‌ఎం శైలజ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



మాగనూర్: మక్తల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు సురేందర్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. బుధవారం టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పూలమాల, శాలువలతో సన్మానించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ.. ఈ ప్రాంత వాసికి నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సైన్స్ అకాడమీ జాతీయ ఉత్తమ అవార్డు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, నరేందర్, తిమ్మన్న, బలరాం, నర్సింహరెడ్డి, దీప, శ్రీనివాసు, విష్ణువర్ధన్, లక్ష్మారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



మరికల్: మండలంలోని పల్లెగడ్డలో భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠాపించారు. కొత్త ఆలయం నిర్మించిన గ్రామస్తులు బుధవారం ఆంజనేయస్వామి విగ్రహం, గణపతి, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



తీలేర్‌లో బండారు వేస్తున్న బంధువులు



తీలేర్‌లో ఎల్లమ్మ పటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ ఆవరణలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి, శివలింగం, దేవతా మూర్తుల విగ్రహాలను అలకరించి ప్రత్యేక పూజలు చేశారు.

తీలేర్‌లో ఎల్లమ్మ బండారోత్సవాలు

ఎల్లమ్మ బండారోత్సవాలు బుధవారం తీలేర్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కుర్వ కులస్తులు ముందుగా ఎల్లమ్మ పటం వేసి పూజలు చేశారు. వచ్చిన బంధువులు ఉత్సవాలను నిర్వహిస్తున్న వారిపై బండారు(పసుపు) వేశారు. బండారు వేసే సమయంలో అలయం భక్తులతో కిక్కిరిసింది. అనంతరం బంధువులు తెచ్చిన కొత్త దుస్తులను ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని దండు గ్రామంలో పార్వతీపరమేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం హోమం నిర్వహించారు. అంతకుముందు కృష్ణానది నీటిని తీసుకొచ్చి విగ్రహాలకు అభిషేకం, ధాన్యదివాసం, శాంతి మంత్రము చేశారు.

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి శివారులోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో బుధవారం శివలింగం, గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శివమాల ధరించే భక్తులకు ఆశ్రమంగా ఉన్న మఠంలో శివపూజలు గణపతి దేవుళ్లను పూజించుకునే అవకాశం లభించిందన్నారు.



మరికల్‌లో లక్ష్మీనర్సింహస్వామి మూలవిగ్రహం



దండు గ్రామంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



దామరగిద్దలో పూజలు చేస్తున్న భక్తులు

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలను గెలుస్తాం



మరికల్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ

మరికల్: రాష్ట్రంలో ప్రజల నాడి పట్టి చూస్తే రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 17 ఎంపీ స్థానాలను గెలుస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విజయ సంకల్ప యాత్ర చేరుకోగానే మహిళలు వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ మరికల్ నుంచి నారాయణపేట మీదుగా జాతీయ రహదారికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా అయోధ్యలో రామ మందిరం నిర్మించడం జరిగిందన్నారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వేణు, రమేష్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలమూరుకు కాంగ్రెస్ అన్యాయం చేసింది

ధన్వాడ: కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు పాటించి, బీఆర్‌ఎస్ రాష్ట్రంలో పదేళ్లు పాలించి పాలమూరుకు అన్యాయం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో రోడ్‌షోలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కోశాధికారి శాంతకుమార్ పాల్గొన్నారు. పాలమూరుకి న్యాయం కావాలంటే బీజేపీ తోనే సాధ్యమన్నారు. పేదవారికి ఐదు కేజీల చొప్పున బియ్యం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, ప్రతి రైతుకు సబ్సిడీతో ఎరువులు ఇస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా కూడా అల్లర్లు, బాంబుదాడులు కాకుండా ఉగ్రవాదంపై ఉక్కుపదం మోపారని అన్నారు. దేశంలో జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ఇటీవల పాలమూరు విశ్వవిద్యాలయానికి రూ.వంద కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. వికారాబాద్–కృష్ణ రైల్వేలైన్ ఇచ్చిన ఘనత మోడిదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఉమేష్, ఉదయబాను, రాంచంద్రయ్య, శ్రీనివాస్, రఘు, వెంకట్రాములు, నారాయణ, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంరక్షణ కమిటీ ఎన్నిక



నియామకపత్రాలు అందుకున్న సభ్యులు

నారాయణపేట రూరల్: స్థానిక అంబేద్కర్‌భవన్‌లో బుధవారం మానవ హక్కుల సంరక్షణ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు శివానంద్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా రవికుమార్‌లను నియమించారు. కురుమయ్య (నారాయణపేట), వెంకటప్ప (దామరగిద్ద), జీ.రామకృష్ణ (ధన్వాడ), భరత్‌రెడ్డి (మరికల్) మండలాల అధ్యక్షులుగా, మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రవిశంకర్‌ను ఎంపిక చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా సంఘం కృషి చేస్తుందన్నారు. మానవుల హక్కులకు భంగం కలగకుండా పోరాడుతామన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం



పౌరాణిక నాటకంలో సన్నివేశం

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి ప్రదర్శించిన రేణుకా ఎల్లమ్మ నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పులిమామిడికి చెందిన పంతులు జయరాములు మూడు రోజులుగా గ్రామంలో ప్రదర్శించారు. ఫోన్‌లు, టీవీలకు అలవాటు పడిన ప్రజలు గ్రామంలో యువకులు ప్రదర్శించిన నాటకాన్ని తిలకించి సంతోషంతో కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా పంతులు జయరాములు మాట్లాడుతూ పౌరాణిక నాటకాలు అంతరిస్తున్న సమయంలో గ్రామంలోని యువకులు మూడు నెలల పాటు నేర్చుకుని ప్రదర్శించడం సంతోషకరంగా ఉందన్నారు. నాటకాల వల్ల మన సంస్కృతి సంప్రదాయాలను పటిష్ఠపరిచిన వారమవుతామని తెలిపారు. నాటక ప్రదర్శనలో బాలకిష్టయ్య, వెంకటేష్, నర్సింహులు, రాజమౌళి, రాఘవేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అభంగాపూర్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులే ఉపాధ్యాయులై స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చక్కటి విద్యాబోధన చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబర్‌నాథ్, టీచర్లు సాయికిరణ్, మాధవి, మౌనిక, చైతన్య, పుష్ప పాల్గొన్నారు.

– మండలంలోని బండగొండ యూపీఎస్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు సుదర్శన్, సాయికుమార్, రవికుమార్, రవీందర్, పవన్, సౌమ్య పాల్గొన్నారు.



మక్తల్‌లో..

మక్తల్: పట్టణంలోని మండల పరిషత్ చాకలిగేరి పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ, హెచ్‌ఎం హైమావతి, సునంద తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ కరువు

మాగనూర్: మండల కేంద్రంలోని ఎన్‌హెచ్–167పై గల డివైడర్ మధ్యలో ఇటీవల మొక్కలు నాటారు. వాటికి రక్షణ మాత్రం కరువైంది. నాటిన కొన్ని రోజులకే మేకలు వచ్చి మొక్కలు తినేస్తున్నాయి. కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బస్టాండ్ చౌరస్తా నుంచి ఒకవైపు మొక్కలు లేకుండా పోయాయి. అధికారులు మరలా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

సీసీరోడ్డు లేక ఇక్కట్లు

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి మండల ప్రాథమిక పాఠశాల ఎదుట సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు. రోడ్డు మొత్తం ఇసుకమయంగా మారిందని వాపోతున్నారు. భోజన సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వాహనాలు, పశువులు వెళ్లేటప్పుడు దుమ్ము వస్తుందని, తరగతి గదిలో పాఠాలు వినలేకపోతున్నామని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.